క్లుప్తంగా

మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లండి

వైఎస్సార్ సీపీ శ్రేణులకు రాజీవ్ కృష్ణ పిలుపు



కొవ్వూరు: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నందున వైఎస్సార్ సీపీ అధిష్టానం ప్రకటించిన నవరత్నాలు ప్లస్ మేనిఫెస్టోను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు ఎస్.రాజీవ్‌కృష్ణ పార్టీ శ్రేణులకు సూచించారు. స్థానిక బాపూజీనగర్‌లోని తన కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రానున్న 12 రోజులూ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులందరూ అభ్యర్థుల గెలుపునకు కష్టించి పని చేయాలని కోరారు. ప్రతి ఒక్క కార్యకర్త కష్టాన్నీ పార్టీ గుర్తిస్తుందన్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో గ్రామాల్లోను, వార్డుల్లోను స్థానిక నాయకులు ప్రచారం కొనసాగించాలన్నారు

తప్పుడు పత్రాలతో పొలం కాజేసిన కేసులో ఇద్దరి అరెస్టు

తాళ్లపూడి: ఫోర్జరీ సంతకాలు, నకిలీ దస్తావేజులు, నకిలీ మరణ ధ్రువీకరణ పత్రాలతో రెండెకరాల భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న అభియోగంపై మండలంలోని అన్నదేవరపేటకు చెందిన మేన్ని చంద్రమోహన్, చినకొండేపూడికి చెందిన పెనిశెట్టి మంగతాయారు అనే ఇద్దరిని తాళ్లపూడి పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక ఎస్సై టి.శ్యామ్‌సుందర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొవ్వూరుకు చెందిన మేన్ని వెంకన్న అనే వృద్ధుడు 2012లో చనిపోయాడు. అయితే ఆ వృద్ధుడు 2001లోనే చనిపోయినట్టుగా అన్నదేవరపేటకు చెందిన మేన్ని చంద్రమోహన్, చినకొండేపూడికి చెందిన పెనిశెట్టి మంగతాయారులు నకిలీ మరణ ధ్రువీకరణ పత్రం సృష్టించి, అతడి ఆస్తిని బ్రతికి ఉండగానే కాజేసి, పట్టాదార్‌పాస్ పుస్తకాలు కూడా పొందారు. దీనిపై వెంకన్న మనవరాలైన గన్నిపూడి శ్రీదేవి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాగా మరో ఆరుగురి ప్రమేయం కూడా ఈ వ్యవహారంలో ఉందని ఆమె ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. సమగ్ర విచారణ అనంతరం ఈ కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్టు ఎస్సై శ్యామ్ తెలిపారు. మరో ఆరుగురి ప్రమేయంపై దర్యాప్తు జరుపుతున్నట్టు తెలిపారు.

ఎస్ఈబీ కేసుల్లో 34 మంది అరెస్టు

కొవ్వూరు: స్థానిక ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో ఏప్రిల్‌లో 34 కేసులు నమోదు చేసి 34 మందిని అరెస్టు చేసినట్టు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. గత నెలలో 40 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు తెలిపారు. అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న వారి నుంచి 188 క్వార్టర్ బాటిళ్లను, 223 బీర్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పాత కేసుల్లో 50 మంది నిందితులను తహసీల్దార్ కోర్టులో బైండోవర్ చేసినట్టు తెలిపారు.

9 మద్యం బాటిళ్లతో మహిళ అరెస్టు

నిడదవోలు రూరల్: మండలంలోని తాడిమళ్ల గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ధనలక్ష్మి అనే మహిళను అరెస్ట్ చేసినట్టు ఎస్ఈబీ నిడదవోలు సీఐ కె.వీరబ్రహ్మం బుధవారం తెలిపారు. ఆమె వద్ద నుంచి 9 మద్యం బాటిళ్లను స్వాధీన పరుచుకున్నామని చెప్పారు.

నేడు ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమావేశం

ఉండ్రాజవరం: నిడదవోలు పట్టణంలోని కాపు కల్యాణ మండపంలో గురువారం ఉదయం 10 గంటలకు ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమావేశం జరుగుతుందని మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు షేక్ షాజహాన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ముస్లిం మైనార్టీలందరూ హాజరు కావాలని బుధవారం ఆయన ఒక ప్రకటనలో కోరారు.

ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

కొవ్వూరు: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా కొవ్వూరు అసెంబ్లీ నియోజకవర్గంలో రెండో తుది విడత ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియను అభ్యర్థుల సమక్షంలో బుధవారం నిర్వహించామని రిటర్నింగ్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. ఎల్రక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ (ఈవీఎం)లు, బ్యాలెట్ కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్స్‌ను ర్యాండమైజేషన్ ప్రక్రియను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నిర్వహించామన్నారు. నియోజకవర్గంలోని 176 పోలింగ్ కేంద్రాలకు 20 శాతం అదనంగా కలిపి 211 బ్యాలెట్ యూనిట్లను, 211 కంట్రోలు యూనిట్లు, 30 శాతం అదనంగా కలిపి 228 వీవీ ప్యాడ్‌లను కేటాయించామన్నారు.

నిడదవోలులో..

నిడదవోలు: నిడదవోలు అసెంబ్లీ సెగ్మెంట్‌కు తుది విడత ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియను అభ్యర్థుల సమక్షంలో ఆర్‌వో, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆర్.వెంకటరమణ నాయక్ బుధవారం నిర్వహించారు. ఎల్రక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లు (ఈవీఎంలు), కంట్రోల్ యూనిట్స్, వీవీ పాట్స్ తుది విడత ర్యాండమైజేషన్‌ను పరిశీలకులు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆర్వో వెంకటరమణ నాయక్ మాట్లాడుతూ ఈ సెగ్మెంట్ పరిధిలో 205 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. ముందుజాగ్రత్త చర్యగా 20 శాతం ఈవీఎంలు అదనంగా కలిపి 246 బ్యాలెట్ యూనిట్లు, 246 కంట్రోల్ యూనిట్లు, 30 శాతం అదనంగా కలిపి 266 వీవీ ప్యాట్‌లు కేటాయించామన్నారు.

మారిన పాఠశాలల రూపురేఖలు

- 'నాడు–నేడు'తో ప్రభుత్వ స్కూళ్లకు మహర్దశ
- తొమ్మిది అంశాలకు ప్రాధాన్యం ఇస్తూ పనులు
- నియోజకవర్గంలో రెండు దశల్లో 264 బడుల అభివృద్ధి
- రూ.65.43 కోట్లు వెచ్చించిన జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం



దేవరపల్లి మండలం కృష్ణంపాలెంలో అభివృద్ధి చేసిన మండల పరిషత్ యూపీ పాఠశాల

దేవరపల్లి: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పించారు. ఆ నాటి ప్రభుత్వం సర్కారీ బడులను మూసివేయడంతో చదువుకునేందుకు పేద విద్యార్థులు పడుతున్న అవస్థలను ప్రజా సంకల్ప పాదయాత్రలో జగన్ చూసి చూసి చలించిపోయారు. తాను అధికారంలోకి రాగానే కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాటకు కట్టుబడి మనబడి నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ బడుల్లో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెడతామని ఆనాడే ప్రకటించారు. సర్కారీ బడుల అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు శ్రీకారం చుట్టారు. తొలి దశలోనే ఒక్కో మండలంలో మూడో వంతు పాఠశాలల అభివృద్ధి పనులను అత్యంత పారదర్శకంగా పూర్తి చేశారు.

తొలి దశలో 86 పాఠశాలలు

నాడు–నేడు పథకం తొలి దశలో గోపాలపురం నియోజకవర్గంలో 86 పాఠశాలలను ఎంపిక చేశారు. రూ.19.29 కోట్లు ఖర్చు చేసి ఈ పాఠశాలల్లో మౌలిక వసతులను అభివృద్ధి చేశారు. చేపట్టిన పనుల నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకుండా నాడు–నేడు నిర్మాణ మెటీరియల్



దేవరపల్లి మండలం రంగరాయ కాలనీ మండల పరిషత్ పాఠశాల్లోని ఓ తరగతి గదిలో బోధన



గోపాలపురం జెడ్పీ హైస్కూల్లో వాష్ రూమ్స్ ఇలా..

మొత్తం మార్కెట్‌లో పేరు మోసిన బ్రాండ్లనే వినియోగించారు. జాగ్వార్ బాత్రూమ్ ఫిటింగ్స్‌ను మధ్య తరగతి వారు కూడ తమ గృహాల్లో వాడే పరిస్థితి లేదు. అలాంటి ఖరీదైన బ్రాండ్లను ప్రభుత్వ పాఠశాలల్లో వినియోగించారు. ప్రతి పాఠశాలా కార్పొరేట్ స్కూల్‌ను తలదన్నే రీతిలో తయారైంది. మంచినీరు, మరుగుదొడ్లు, తరగతి గదుల్లో ఫ్యాన్లు, విద్యుత్తు దీపాలు, డిజిటల్ క్లాస్ రూమ్స్, బ్లాక్ బోర్డ్స్, ఫర్నిచర్ కొనుగోలు, పాఠశాలల సుందరీకరణ, ప్రహరీలు, తరగతి గదుల నిర్మాణం వంటి తొమ్మిది అంశాలపై దృష్టి సారించి నాణ్యతతో పనులు పూర్తి చేశారు.

మరే రాష్ట్రంలోనూ లేని విధంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. తొమ్మిది అంశాల ప్రామాణికంగా ఈ అభివృద్ధి పనులు చేపట్టారు. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడలేదు. ఎస్.టి.ఎం.ఎస్ (స్కూల్ ట్రాన్స్‌ఫార్మరీ మానిటరింగ్ సిస్టమ్) ద్వారా ముఖ్యమంత్రి రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న నాడు–నేడు పనులను పర్యవేక్షించారు.

125 తరగతి గదుల నిర్మాణం

గోపాలపురం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో నాడు–నేడు పథకం మొదటి, రెండవ దశల్లో రూ.65.43 కోట్ల వ్యయంతో 264 పాఠశాలలను అభివృద్ధి చేశారు. సుమారు 125 అదనపు తరగతి గదులను నిర్మించారు. శిథిల పాఠశాలల భవనాలు ఏ గ్రామంలోనూ లేకుండా చర్యలు తీసుకున్నారు. 20 పాఠశాలలకు ప్రహరీలు నిర్మించారు. కిచెన్ షెడ్లు, టాయిలెట్స్, రన్నింగ్ వాటర్, విద్యుత్ వైరింగ్, ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు, పెయింటింగ్, డ్రింకింగ్ వాటర్ ఆర్వో సిస్టమ్, భవనాల మరమ్మతుల వంటి తొమ్మిది అంశాలపై దృష్టి పెట్టి పనులను పూర్తి చేశారు.

వైఎస్సార్ సీపీలోకి తూర్పు కాపు సంఘం



పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు: పట్టణానికి చెందిన తూర్పు కాపు సంఘం వైఎస్సార్ సీపీలో చేరింది. ఈ సంఘంలోని సుమారు 50 మంది సభ్యులకు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు బుధవారం పట్టణంలో పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైఎస్సార్ సీపీ పట్టణ నాయకులు పాల్గొన్నారు.

ఎంఈఓ ఖాదర్‌బాబుకు వీడ్కోలు సన్మానం

చాగల్లు: ఉద్యోగ విరమణ చేసిన ఎంఈఓ ఖాదర్ బాబు సేవలు ప్రశంసనీయమని డీఈఓ అబ్రహం కొనియాడారు. నెలటూరు గ్రామంలోని సీతారామ స్వామి కల్యాణ మండపంలో బుధవారం ఖాదర్ బాబు వీడ్కోలు, అభినంద సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఖాదర్‌బాబు దంపతులను పలువురు ఉద్యోగులు శాలువాలతో సత్కరించారు. పుష్పగుచ్ఛాలు అందజేశారు. అబ్రహం మాట్లాడుతూ ఖాదర్‌బాబు ఉపాధ్యాయుడిగా కెరీర్ ప్రారంభించి ఎంఈఓగా పదవీ విరమణ చేయడం అభినందనీయమన్నారు. ఉప విద్యాశాఖాధికారులు కె.వాసు దేవరావు, నారాయణరావు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటేసి జగనన్నను ఆశీర్వదించండి



దేవరపల్లి మండలం సంగాయగూడెం ప్రచారంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు తానేటి వనిత, డాక్టర్ గూడూరి శ్రీనివాస్

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తానేటి వనిత
- రెండు మండలాల్లో విస్తృతంగా ప్రచారం
- పాల్గొన్న ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి

దేవరపల్లి: ఫ్యాన్ గుర్తుపై ఓటేసి, జగనన్నను ఆశీర్వదించాలని వైఎస్సార్ సీపీ గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి, రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత ఓటర్లను అభ్యర్థించారు. దేవరపల్లి మండలంలోని సంగాయగూడెం, గాంధీనగరం, యాదవోలు, చిన్నాయగూడెం, ద్వారకాతిరుమల మండలంలోని వెంకటకృష్ణాపురం, రామన్నగూడెం గ్రామాల్లో బుధవారం వనిత ప్రచారం చేశారు. ఉదయం ద్వారకాతిరుమల, సాయంత్రం దేవరపల్లి మండలాల్లో వనిత ప్రచారం సాగింది. సాయంత్రం నిర్వహించిన ప్రచారంలో ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వనిత మాట్లాడుతూ నలభై ఏళ్ల రాజకీయ అనుభవం, 14 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిని అని చెప్పుకునే దగాకోరు చంద్రబాబుకు మరోసారి ముఖ్యమంత్రి అయ్యే అర్హత లేదన్నారు.

జగనన్న 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలనే కాకుండా, ఇవ్వని హామీలను కూడా నెరవేర్చారన్నారు. మళ్లీ ఆయన సీఎం అయితేనే పేదలకు సంక్షేమ ఫలాలు అందుతాయన్నారు. మీ ఆడబిడ్డగా మీకు అందుబాటులో ఉంటాను. మీ అవసరాలు తీర్చుతానంటూ వనిత భరోసా ఇచ్చారు. మీ రెండు ఓట్లు పంపకాలు చేయకుండా ఫ్యాన్ గుర్తుపై వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా డాక్టర్ శ్రీనివాస్‌ను గెలిపించి అసెంబ్లీ, పార్లమెంట్‌కు పంపించాలని ఆమె కోరారు. ప్రచారంలో ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, ఆచంట అనసూయ, సుంకవల్లి చిన వెంకట నాగదేవి, సుంకవల్లి శ్రీనివాస్, మేడిబోయిన గంగరాజు, నరహరిశెట్టి రాజేంద్రబాబు, గెడా జగదీష్, చైర్మన్ గెడా రాంబాబు, చెలికాని రాజబాబు, ఎంపీపీ బొండాడ మోహిని, జెడ్పీటీసీ సభ్యుడు చిగురుపల్లి శామ్యూల్ పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులకు బుద్ధి చెప్పండి



మునిపల్లిలో ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీనివాస్‌నాయుడికి గుమ్మడి కాయ దిష్టి తీస్తున్న మహిళ

- వైఎస్సార్ సీపీ నిడదవోలు ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీనివాస్‌నాయుడు
- నిడదవోలు మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం

నిడదవోలు రూరల్: రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా జగనన్న పాలనలో అభివృద్ధి జరిగిందని, సంక్షేమ పథకాలు లబ్ధిదారుల ఇంటికే చేరాయని, దీంతో ప్రజలు మళ్లీ ఆయననే ముఖ్యమంత్రిగా గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మండలంలోని మునిపల్లి, కలవచర్ల, డి.ముప్పవరం గ్రామాల్లో ఆయన బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలు శ్రీనివాస్‌నాయుడికి ఘన స్వాగతం పలికి ప్రచారంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. మరోసారి చంద్రబాబు మోసపూరిత హామీలతో వస్తున్నారని, ప్రజలంతా ఈ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు బుద్ధి చెప్పాలని కోరారు. ఈనెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థిగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి భారీ మెజార్టీలతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ ప్రచారంలో వైఎస్సార్ సీపీ మండలశాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, రాష్ట్ర నాయకుడు ముళ్లపూడి శ్రీనివాస్‌కుమార్‌చౌదరి, జేసీఎస్ మండల కన్వీనర్ వెలగన పోలయ్య, సర్పంచులు వెలగన నరేష్, నాగిరెడ్డి నాగదేవి, ఎంపీటీసీ సభ్యులు కొర్లపాటి మోహన్, సంగినీడి సత్యనారాయణ, సొసైటీ అధ్యక్షులు యాళ్ల రామారావు, సుంకవల్లి శ్రీహరి, మాజీ ఎంపీపీ మన్యం సూరిబాబు, పార్టీ నాయకులు పులుమంతుల రామారావు, మద్దాల ప్రభు, పసుపులేటి చిట్టియ్య, బోనేపల్లి సుబ్బారావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

మండుటెండలో అభ్యర్థుల రోడ్ షో

చాగల్లు: మండుటెండను సైతం లెక్క చేయకుండా వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగింది. ఆ పార్టీ కొవ్వూరు అసెంబ్లీ, రాజమహేంద్రవరం లోక్‌సభ అభ్యర్థులు తలారి వెంకట్రావు, డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌లు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చాగల్లుతో పాటు మీనానగరం, నెలటూరు, నందింగంపాడు, ఊనగట్ల, ఎస్.ముప్పవరం, బ్రాహ్మణగూడెం తదితర ప్రాంతాల్లో వారిద్దరూ రోడ్డు షో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు మాట్లాడుతూ పారదర్శక పాలనతో ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోలో పేర్కొన్న 99 శాతం హామీలను అమలు చేశారన్నారు. టీడీపీ కూటమిని బీజేపీ నాయకులే నమ్మడం లేదన్నారు. డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో రాష్ట్రంలోని పేదరికాన్ని 12 నుంచి 4.45 శాతానికి తగ్గించారన్నారు. వచ్చే ఎన్నికల్లో రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుకే వేయాలని అభ్యర్థించారు. రోడ్‌షోలో వైఎస్సార్ సీపీ రాజానగరం పరిశీలకుడు కవురు శ్రీనివాస్, ఎంపీపీ మట్టా వీరాస్వామి, జెడ్పీటీసీ సభ్యురాలు గారపాటి విజయదుర్గ, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గంగ్రోతు సురేంద్రకుమార్, పార్టీ మండల అధ్యక్ష, గౌరవాధ్యక్షుడు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, జుట్టా కొండలరావు, సొసైటీ అధ్యక్షుడు ఆత్కూరి దొరయ్య తదితరులు పాల్గొన్నారు.



రోడ్ షోలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు తలారి వెంకట్రావు, డాక్టర్ గూడూరి శ్రీనివాస్

జగనన్న గెలుపే పేదల విజయం

- వైఎస్సార్ సీపీకి ఎమ్మార్పీఎస్ సంపూర్ణ మద్దతు
- ఆ సంస్థ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు బ్రహ్మయ్య



మీడియాతో మాట్లాడుతున్న బ్రహ్మయ్య

నిడదవోలు: మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) సంపూర్ణ మద్దతు ఇస్తోందని ఆ సంస్థ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు ఉసిరిపాటి బ్రహ్మయ్య పేర్కొన్నారు. పట్టణంలోని రోటరీ ఆడిటోరియంలో బుధవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ గెలుపు పేదల గెలుపుగా భావించి వైఎస్సార్ సీపీని గెలిపించాలని రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, ముస్లిం, మైనార్టీలకు పిలుపు ఇస్తున్నామన్నారు. రాష్ట్రంలోని పెత్తందారులకు వ్యతిరేకంగా పేదల అభ్యున్నతి కోసం జగన్ కృషి చేస్తున్నారని చెప్పారు. తన ఐదేళ్ల పాలనలో మంచి జరిగితే ఓటు వేయమని కోరుతున్న దమ్మున్న నాయకుడు జగన్ మాత్రమే అన్నారు. జగన్ గెలుపునకు తాము పని చేయడానికి కారణం ఆయన మాటిస్తే నిలబడే వ్యక్తి అన్నారు. ఎస్సీ వర్గీకరణ చేయకుండా 30 ఏళ్లుగా మాదిగలను మోసగించిన చంద్రబాబు, ఎన్నికల్లో మాదిగల మద్దతు కోరడం సిగ్గు చేటన్నారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేపడతామన్న బీజేపీ ప్రభుత్వం పదేళ్లు గడుస్తున్నా ఆ అంశాన్ని పార్లమెంట్‌లో ప్రస్తావించకుండా మభ్యపెడుతోందన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం కేంద్రంపై యుద్ధమే అని ప్రకటించిన మంద కృష్ణ ఈరోజు ఎందుకు ప్రధాని నరేంద్ర మోదీ కౌగిలిలో దూరారో చెప్పాలని బ్రహ్మయ్య డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరు శ్రీనివాస్, నిడదవోలు ఎమ్మెల్యే అభ్యర్థి జి.శ్రీనివాస్ నాయుడులను గెలిపించాలని ఆయన కోరారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మారుగుడి సురేష్, పండు మాదిగ, గెడ్డం రవీంద్రబాబు, దున్న మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం

నిడదవోలు/పెరవలి: వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జి.శ్రీనివాస్‌నాయుడికి మద్దతుగా ఆయన కుమారుడు వరుణ్‌సాయి పట్టణంలోని 6వ వార్డులో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి తన తండ్రి, ఎమ్మెల్యే అభ్యర్థి జి.శ్రీనివాస్‌నాయుడిని, ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్‌లను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే తన తండ్రి తరఫున వరుణ్‌సాయి మండల కేంద్రమైన పెరవలిలో ప్రచారం చేశారు. సర్పంచ్ గంగోలు సీతమ్మ పంపన అంజి పాల్గొన్నారు.

తలారికి మద్దతుగా..

తాళ్లపూడి: వైఎస్సార్ సీపీ కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావుకు మద్దతుగా ఆయన కుమార్తె షాలిని తాళ్లపూడిలో బుధవారం ప్రచారం చేశారు. గ్రామానికి చెందిన పార్టీ శ్రేణులతో కలిసి ఆమె ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేయాలని అభ్యర్థించారు. నమూనా బ్యాలెట్ పత్రాలను, మేనిఫెస్టో ప్రతులను అందజేశారు. తన తండ్రి వెంకట్రావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు, రాజమహేంద్రవరం లోక్‌సభ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌లను గెలిపించాలని కోరుతూ బుధవారం మండలంలోని పెద్దేవం గ్రామంలో కాపు జేఏసీ, వైఎస్సార్ సీపీ నాయకుడు తోట రామకృష్ణ, సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు గ్రామంలోని గడపగడపకూ వెళ్లి ప్రచారం చేశాయి. అలాగే పోచవరం గ్రామంలో ఆ పార్టీ మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరరావు పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. రెండు ఓట్లు ఫ్యాను గుర్తుపై వేసి అభ్యర్థులిద్దరినీ అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు.



దేవరపల్లిలో వనితకు మద్దతుగా ప్రచారం చేస్తున్న ఎంపీపీ దుర్గారావు, పార్టీ శ్రేణులు

వనితకు మద్దతుగా..

దేవరపల్లి: వైఎస్సార్ సీపీ గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి, హోం మంత్రి తానేటి వనితకు మద్దతుగా దేవరపల్లిలో ఎంపీపీ కేవీకే దుర్గారావు ఆధ్వర్యంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం చేశారు. పార్టీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ మేనిఫెస్టోను అందజేశారు.

శ్రమజీవుల ఆధ్వర్యంలో మేడే వేడుకలు



ద్వారకాతిరుమల మండలం వెంకట కృష్ణాపురంలో కేక్ కట్ చేస్తున్న రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత

- వెంకటకృష్ణాపురంలో కేక్ కట్ చేసిన మంత్రి వనిత
- రెపరెపలాడిన మేడే పతాకాలు

దేవరపల్లి: కార్మిక దినోత్సవ (మేడే) వేడుకలను దేవరపల్లి, ద్వారకాతిరుమల మండలాల్లో వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శ్రమజీవులు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ద్వారకాతిరుమల మండలం వెంకటకృష్ణాపురంలో వైఎస్సార్ సీపీ గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి, రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత కార్మికులతో కలిసి కేక్ కట్ చేశారు. కార్మికులకు మేడే శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, ఎంపీపీ బొండాడ మోహిని, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసుబాబు, ఉపాధి హామీ కూలీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. దేవరపల్లి మండలం దుద్దుకూరులో ప్రగతిశీల కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్కే మస్తాన్ మేడే పతాకాన్ని ఆవిష్కరించారు. సీఐటీయూ, సీపీఎం ఆధ్వర్యంలో దేవరపల్లిలో మేడే వేడుకలు జరిగాయి. సీఐటీయూ పతాకాన్ని సీపీఎం నాయకుడు ఉండవల్లి కృష్ణారావు ఆవిష్కరించారు. సీఐటీయూ మండల కార్యదర్శి ఎస్.భగత్, కార్మికులు, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. దేవరపల్లి, దుద్దుకూరు గ్రామాల్లో ఆటో వర్కర్స్ యూనియన్ల ఆధ్వర్యంలో మే డే వేడుకలు నిర్వహించారు.

దేవరపల్లి మండలంలోని వెంకటకృష్ణాపురం గ్రామంలో నిర్వహించిన మేడే వేడుకల్లో పాల్గొన్న మంత్రి వనిత తొలుత కేక్ కట్‌చేసి, మహిళా కార్మికులకు తినిపించారు.

కొవ్వూరులో..

కొవ్వూరు: సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ సెంటర్లోని స్థూపం వద్ద సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు మేడే పతాకాన్ని ఎగుర వేశారు. కోరమండల్ కాంక్రీట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఫ్యాక్టరీ గేటు వద్ద బీరా రవి, పుంతలో ముసలమ్మ గుడి వద్ద సాయిగణేష్ పెయింటర్స్ యూనియన్ నాయకులు సిద్ధరెడ్డి బాపిరాజు, జట్టు కార్మికుల సంఘం ఆధ్వర్యంలో మార్కెట్ వద్ద మంచిలి వీరబాబు పతకాలను ఆవిష్కరించారు. కొవ్వూరమ్మ గుడి సెంటర్‌లో జట్టు కార్మికుల సంఘం అధ్యక్షుడు ఉడతల సతీష్, చైతన్య తాపీ వర్కర్స్ యూనియన్ కార్యాలయం వద్ద అధ్యక్షుడు మైగాపుల నాగేశ్వరరావు, మునిసిపల్ కార్యాలయం వద్ద ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు భూపతి రవీంద్ర, సీతంపేట బస్టాండ్ సెంటర్‌లో శ్రీవిజయదుర్గ భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు కొమ్మన రాముడు, వాడపల్లిలో కృష్ణ చైతన్య లారీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు వీరా త్రిమూర్తులు మేడే పతాకాలు ఆవిష్కరించారు.